సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



టమాటా ధర ధమాల్!

నిన్న మొన్నటి వరకు రూ.60–రూ.70 ఓ దశలో రూ.100కు చేరువైన కిలో టమాటా ఇప్పుడు వ్యవసాయ మార్కెట్లలో కనీస ధరలకు కొనడం లేదు. -8లో



చిరుద్యోగులపై కక్ష సాధింపు

చిరుద్యోగులపై కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. జి.కొత్తకోటకు చెందిన పలువురు సంఘ మిత్రలను తొలగించడం వివాదానికి దారి తీసింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.136



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 127 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	566	570
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 182.200 కిలోలు

న్యూస్‌రీల్

నేటినుంచి డోర్‌డెలివరీ మాసోత్సవాలు

రాయచోటి అర్బన్: రాష్ట్ర రోడ్డురవాణ సంస్థ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా రవాణాధికారి రాము కోరారు. డిసెంబర్ 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 80 ముఖ్యపట్టణాలకు వినియోగదారుల పార్శిళ్లను కార్గో ద్వారా చేరవేయనున్నట్లు తెలిపారు. ఆయా పట్టణాల్లో కూడా 50 కేజీల వరకు 10 కిమీల పరిధివరకు ఉచిత డోర్‌డెలివరీ సదుపాయం ఉందన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

చిన్నమండెం: ప్రతి రైతు ఇ- పంట నమోదుతో పాటు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ అన్నారు. గురువారం చిన్నమండెం మండలం వండాడి రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ పంటన మోదును ఆయన పర్యవేక్షించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు అర్హులు అవుతారని అన్నారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన

పెద్దమండ్యం: మండలంలోని కోటకాడపల్లె, పెద్దమండ్యం గ్రామాలలో వాటర్‌షెడ్ కార్యక్రమం ద్వారా చేపట్టిన పలు పనులను డ్వామా పీడీ వెంకటరత్నం గురువారం పరిశీలించారు. పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన బోర్డులను, రికార్డులను తనిఖీ చేశారు. వర్షం నీటిని నిలువరిస్తే భూగర్భ జలాలు పెంపొందించుకోవచ్చన్నారు. గల్లీలు, రాతి కట్టడాలు చిన్న నీటి కుంటలను తనిఖీ చేశారు. అలాగే ఉపాధిహామీ ద్వారా సీ గొల్లపల్లె పంచాయతీలోని మండ్యం మాదిగపల్లెలో చేపడుతున్న పశువుల షెడ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు సకాలంలో పనులు కల్పించాలన్నారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, వాటర్‌షెడ్ ఏపిడి లక్ష్మీనరసయ్య, పీవో రవీంద్రుడు, ఏపీవో మురళి పాల్గొన్నారు.

మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో సీఐడీ పోలీసుల విచారణ



రైతులను విచారిస్తున్న సీఐడీ సీఐ రాజేష్‌కుమార్

గుర్రంకొండ: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధమైన కేసులో సీఐడీ పోలీసులు మండలంలోని తరిగొండ గ్రామంలో గురువారం నెల్లూరు సీఐడీ సీఐ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసు అధికారుల బృందం 20 మంది విచారణ జరిపారు. మదనపల్లెకు చెందిన ఓ రిటైర్డ్ పోస్టల్ అధికారిని కూడా విచారించారు.విచారణలో సదరు అధికారి మండలంలోని తరిగొండ, శెట్టివారిపల్లె గ్రామాల్లో పలువురు రైతుల దగ్గర భూములు కొనుగోలు చేసినట్లు వెలుగుచూసింది. ఈనేపథ్యంలో సీఐడీ పోలీసులు మొత్తం 20 మంది రైతులను పూర్తిస్థాయిలో విచారించారు. రైతుల దగ్గర కొనుగోలు చేసిన భూములు రైత్వారీపట్టావా లేక ప్రభుత్వ భూములా అని ఆరా తీశారు. రైతులందరూ సదరు రిటైర్డ్ పోస్టర్ అధికారికి మనస్ఫూర్తిగా విక్రయించారా లేక దౌర్జన్యంగా రాయించుకొన్నారా అన్న అంశాలపై విచారణ జరిపి రైతుల దగ్గర రికార్డులు, స్టేట్‌మెంట్లు తీసుకొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు!

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి తారాస్థాయికి చేరింది. ఏకంగా మెరిట్ జాబితానే తారుమారు చేసే స్థాయికి దిగజారింది. ముఖ్యంగా కొందరు ఉద్యోగులు ముఠాగా ఏర్పడి బోగస్ సర్టిఫికెట్స్‌తో అనర్హులను అందలం ఎక్కిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. లక్షలాది రూపాయలు చేతులు మారిన ఈ ఘటనతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రకంపనలు మొదలయ్యాయి.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో.. బోగస్ సర్టిఫికెట్ల బాగోతం!

- మార్కుల జాబితాలో 'అంకెలు' తారుమారు
- పలువురికి అడ్డదారుల్లో ఉద్యోగాలు
- ఒక్కొక్కరి నుంచి లక్షలాది రూపాయలు వసూలు
- కార్యాలయ సిబ్బంది చేతివాటం
- అక్రమాలపై అధికారులకు ఫిర్యాదులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి అవినీతి జబ్బు పట్టుకుంది. బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలనే తారుమారు చేశారని ఫిర్యాదులతో ఆ శాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వైద్య ఆరోగ్యశాఖలో 2020లో వివిధ కేడర్‌లకు జరిగిన రిక్రూట్‌మెంట్‌లో 15 మందికి, 2023లో వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు జిల్లా క్షయ నియంత్రణ విభాగానికి చేపట్టిన నియామకాల్లో 9 మందికి బోగస్ సర్టిఫికెట్స్ ద్వారా ఉద్యోగాలు కల్పించిన విషయం వెలుగులోకి వచ్చింది.ఇందుకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో నిర్వహించారు.

పక్కాగా చేశారిలా...

తొలుత ఉద్యోగాల కోసం దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్‌ను పరిశీలిస్తారు. ఇందులో కొందరిని ఎంపిక చేసుకుని రాయ'బేరాలు'నడుపుతారు. ఒప్పందం కుదిరాక ఉద్యోగం ఇప్పించడానికి అడ్డదారుల్లో వెళ్తారు. తామనుకున్న అభ్యర్థులకు నిబంధనల ప్రకారం 'మెరిట్'ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అందుకోసం స్వయంగా బోగస్ సర్టిఫికెట్స్‌ను తయారు చేస్తారు. మార్కుల జాబితాలో ఎక్కువ మార్కులు ఉండేలా మార్కుల 'అంకెలు'ను మార్చేస్తారు. అంతేనా.. అభ్యర్థులు ఉద్యోగానికి సంబంధించిన కోర్సులు చదవనప్పటికీ.. బోగస్ సర్టిఫికెట్స్‌ను తయారుచేసి దరఖాస్తులో ఉంచుతారు. ఇలా సీరియల్ నెంబర్, హాల్ టికెట్ నెంబర్లతో సహా మార్పులు చేశారు. దీంతో అభ్యర్థులు ఉద్యోగాల ఎంపిక జాబితాలో మెరిట్ ఆధారంగా ఎంపికయ్యేలా చేశారు. తరువాత ఎంపికైన అభ్యర్థుల ఒరిజనల్ సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్‌ను చేపట్టే సిబ్బంది కూడా తమ అనుచరులే కావడంతో సర్టిఫికెట్స్‌ను తూతూ మంత్రంగా పరిశీలించి, అంతా బాగున్నట్లు ఓకే చెప్పేస్తారు. దీంతో తామనుకున్న అనర్హులకు ఉద్యోగం వచ్చేలా చేశారు. ఇలా ఒక్కొక్కరి నుంచి రూ. 5 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది..

ఆ సిబ్బంది నిర్వాకంతోనే...

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులపై ఎప్పటి నుంచో ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా వస్తున్న ఆరోపణ ల్లోనూ వారి పాత్రే ఉండడం గమనార్హం. అందులో ఒకరు వేరొక మండల కేంద్రంలో పనిచేయాల్సిన సీనియర్ అసిస్టెంట్, ఇక్కడే డిప్యుటేషన్‌పై విధులు చేపడుతున్నారు. మరొకరు కార్యాలయంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ఇంకొక వ్యక్తి గతంలో ఇక్కడే అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం కడప రిమ్స్ జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులను చేపడుతున్నారు. వీరితో పాటు మరికొందరి పాత్ర కూడా ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఇందులో ఒక సీనియర్ అసిస్టెంట్ తమ కుటుంబ సభ్యులిద్దరికి బోగస్ సర్టిఫికెట్స్‌తోనే ఉద్యోగాలు ఇప్పించినట్లు సమాచారం. జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న మరొక ఉద్యోగి కూడా బోగస్ సర్టిఫికెట్స్‌తోనే ఉద్యోగం చేస్తున్నారు

పరిశీలిస్తున్నాం



రెండు వారాల క్రితం ఇద్దరు ఉద్యోగులపై ఫిర్యాదులు వచ్చాయి. ఆ సర్టిఫికెట్స్ పరిశీలన కోసం యూనివర్శిటీకి పంపించాం. నేను విజయవాడలో ఉన్నందున పూర్తి వివరాలు తెలియలేదు. ఏవైనా ఉంటే పరిశీలిస్తాం.- డాక్టర్ రవిబాబు, అధికారి, క్షయ నియంత్రణ విభాగం

విచారణకు ఆదేశించాం



కొందరు ఉద్యోగులపై ఫిర్యాదులు వచ్చాయి. వారి సర్టిఫికెట్లను ఆయా యూనివర్సిటీలకు పంపించాం. వారిచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటాం. దీనిపై విచారణకు ఆదేశించాం. - డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఆ వ్యక్తి ద్వారానే వాస్తవాలు వెలుగులోకి.....

ఎవరైతే బోగస్ సర్టిఫికెట్స్ ద్వారా ఉద్యోగం పొందారో అందులో ఓ వ్యక్తి ద్వారానే ఆ కార్యాలయంలో జరిగే బోగస్ భాగోతం వెలుగు చూడడం గమనార్హం .అతని పేరు రమేష్ (పేరు మార్చాం). ఇతను ఉద్యోగం కోసం యత్నించారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఆధ్వర్యంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని జిల్లా క్షయ నియంత్రణ యూనిట్‌లో ఆర్ఎన్ టీసీపీ ప్రోగ్రాం కింద (టీబీహెచ్‌వీ సూపర్‌వైజర్)గా పనిచేయడానికి దరఖాస్తు చేశాడు. నిజానికి ఇతను బీకాం పూర్తి చేశారు. ఈ క్రమంలో అక్కడ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో (ప్రస్తుతం జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు చేపడుతున్నారు) పరిచయం ఏర్పడింది. ఆ ఆపరేటర్ ఖర్చు పెట్టుకుంటే ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందని చెప్పారు. అందుకు రమేష్ ఒప్పుకున్నాడు. అనంతరం రమేష్‌ను ఆ ఉద్యోగి కార్యాలయంలో పనిచేస్తున్న ఆ ఇద్దరు సీనియర్ అసిస్టెంట్స్‌ను పరిచయం చేశారు. వారు రూ.5 లక్షలు అడిగినా.. చివరికి రూ.3 లక్షల బేరం కుదిరింది. ఈ క్రమంలో ఓ రోజు సదరు సీనియర్ అసిస్టెంట్స్ రూ.3 లక్షలు అడిగారు. రమేష్ అనుమానించి ఇవ్వలేదు. అది గమనించిన సీనియర్ అసిస్టెంట్స్ 'మెరిట్ లిస్ట్‌లో నీ పేరుంటేనే డబ్బులివ్వు'అని చెప్పి వెళ్లిపోయాడు. కొద్ది రోజుల తరువాత మెరిట్ జాబితా.. ఆపై ఫైనల్ జాబితాలో కూడా పేరు ఉండడంతో రమేష్ ఉద్యోగంలో చేరాడు. అనంతరం ఒప్పందం ప్రకారం రూ. 3 లక్షలకు గాను రూ.2 లక్షలు సమర్పించుకున్నారు. కొద్ది రోజులకు మిగతా లక్ష ఇవ్వాలని రమేష్‌పై సీనియర్ అసిస్టెంట్స్ ఒత్తిడి చేశారు. ఇప్పటికే రూ.2 లక్షలు అప్పు చేసి ఇచ్చిన రమేష్, మిగతా లక్షను సమకూర్చలేకపోయారు. ఇక డబ్బులు మీకివ్వలేనని ప్రాధేయ పడినా వారు ఒప్పుకోలేదు. దీంతో ఆ ఇద్దరిలో ఒక సీనియర్ అసిస్టెంట్ వేరొకరి చేత రమేష్ బోగస్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగం పొందినట్లుగా, సమాచారం కావాలని సమాచార హక్కు చట్టం ద్వారా అడిగారు. దీంతో భయపడిన రమేష్ ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేశారు.

అవినీతిపై ఫిర్యాదులు...



తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని భావించిన రమేష్ అక్కడ జరుగుతున్న అక్రమాలను కళ్లారా చూసిన ఆయన పూసగుచ్చినట్లుగా ఎస్పీతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేగాక తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే 'లంచం ఇవ్వడం కూడా నేరమే' అని రమేష్‌ను కొందరు బెదిరించినట్లుగా సమాచారం. ఈ అంశానికి సంబంధించి మొత్తం 23 మంది ఉద్యోగులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే సందర్భంలో పై స్థాయి అధికారులు విచారణకు రాకముందే జిల్లా స్థాయిలోనే డీఎంహెచ్‌ఓ పరిధిలోనే విచారణ జరిపించాలనే ఆలోచనలో ఉన్నట్లుగా సమాచారం. ఒక్క రమేషే కాదు చాలా మంది అనర్హులు ఉద్యోగాలు చేస్తున్నారని... వాస్తవాలు వెలుగులోకి రావాలంటే నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా ఎప్పటినుంచో జిల్లా వైద్యశాఖ కార్యాలయం తీరుపై ఆరోపణలు, విమర్శలు వస్తూనే ఉన్నాయి. తాజాగా అవి బట్టబయలవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

మాధవరంలో కేంద్ర బృందం పర్యటన

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా సిద్దవటం మండలం మాధవరం వన్‌లో గురువారం కేంద్ర చేనేత, జౌళి శాఖ అధికారులు సృష్టి, జాస్మిన్ పర్యటించారు. ఇక్కడ నేసిన పట్టువస్త్రాలను వేరే ప్రాంత్రాల వస్త్రాలుగా అమ్ముడు పోతుండటంతో వీటికి గుర్తింపు ఇవ్వాలని గతంలో నాబార్డ్ చేసిన సిఫారస్సు చేసింది. ఈ మేరకు ఢిల్లీ నుంచి అధికారుల బృందం సిద్దవటం మండలంలో పర్యటించింది. ఈసందర్భంగా అధికారులు సృష్టి, జాస్మిన్ మాధవరం సమీపంలోని ఎస్ కేఆర్ నగర్ లో గల చేనేత కార్మికుల గృహాల్లోని మగ్గాలను, నేత వేసిన పట్టు వస్త్రాలను పరిశీలించారు.వస్త్రాల తయారీకి ఎలాంటి ముడిసరుకులు వాడుతున్నారని చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, హ్యాండ్ లూమ్స్ ఏడీ పిచ్చేశ్వరరావు, ఏడీవోలు వనిత, రవి ప్రకాష్‌రెడ్డి, సేసగిరిరావు, ఒంటిమిట్ట ఏపీఎం అశోక్ రెడ్డి, వన్ మాధవరం చేనేత కార్మికులు ఉన్నారు.



చేనేత కార్మికుల మగ్గాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

- అంతకుముందు కేంద్ర చేనేత, జౌళి శాఖ అధికారులు ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్యను దర్శించుకున్నారు. అర్చకులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాలాలయంలోని సీతారామ లక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

కడప ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యార్థినులకు మానసికోల్లాసం కలుగుతుందని కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024–25 వేడుకల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అధ్యక్షతన అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఉమ్మడి కడపజిల్లాలోని 13 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులకు నిధులు మంజూరు

లక్కిరెడ్డిపల్లి: జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ. 13.19 కోట్లను మంజూరు చేసిందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంపల వెంకటరమణలు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లిలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు మెనూ ప్రకాశం భోజనం వడ్డిస్తున్నారా లేదా, విద్యా మెటీరియల్, యూనిఫామ్ అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్నాయని,ఉత్తమ ఫలితాల సాధించేందుకు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్సీ–1, ఎస్సీ–2 బాలుర వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. లక్కిరెడ్డిపల్లిలోని వసతి గృహాల మరమ్మతులకు రూ. 68 లక్షలు, బాలికల వసతి గృహానికి రూ. 9 లక్షలు మంజూరయ్యాయన్నారు. జిల్లాలోని 43 వసతి గృహాలకు మౌలిక వసతులు, ఇతర నిర్మాణం పనులకోసం రూ. 19.16 కోట్లు నివేదికలు పంపించామని, ప్రస్తుతం రూ. 13.19 కోట్లు మంజూరు అయ్యాయ చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓలు రమేష్ బాబు, శ్రీనివాసులు, సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులు సత్వరమే పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎ.అమరనాథ రెడ్డి, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి తదితరులు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట: ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వరమే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అక్రమంగా బనాయించే ఎస్సీ, ఎస్టీ కేసులపై సమగ్ర విచారణ చేసిన తరువాత చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల పరిష్కారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని, కావున బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సూచించిన అంశాలను పాటించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

- సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ప్రస్తావించబడ్డ పలు అంశాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజంపేట ఎస్‌డీపీఓ (పోలీస్‌శాఖ) ఎన్ సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంకోసం సమీక్ష నిరంతరం ఉంటుందన్నారు. సమావేశంలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు చెందిన దళిత ప్రజా ప్రతినిధులు, సంఘాల నేతలు, వైఎస్సార్ సిపి దళిత నేతలు దండు గోపి, దాసరి పెంచలయ్య, పెనుబాల నాగసుబ్బయ్య, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి మెట్టు.. వంద రోజుల్లో గట్టెక్కేట్టు

- పదిలో ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు
- మారిన సిలబస్, పరీక్షా విధానం, మెలకువలు సూచిస్తున్న టీచర్లు
- 2025 మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు





మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌లో విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు ఉన్నత చదువులకు మొదటి మెట్టు వంటిది. అందులో ఉత్తీర్ణత సాధించాలని, మంచి మార్కులు పొందాలనేది ప్రతి ఒక్కరి ఆశయం. ఈ సారి సిలబస్ మారడంతో విద్యార్థులు కాస్త తడపడుతున్నారు. అందుకు తగ్గట్టు ఈ ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా వారిని ఇప్పటి నుంచే సమాయత్తం చేస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబర్ నెల నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. 2025 సంవత్సరం మార్చి 17 నుంచి మార్చి 31 వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలును రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 304 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 23,311 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుని, మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేలా ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు.

అదనపు తరగతుల నిర్వహణ

వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు,మధ్యాహ్నం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ప్రతి ఒక్కరూ ఆరుగురు నుంచి 8 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు? ఏ సబ్జెక్టుల్లో వెనుబడి ఉన్నారు? వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ప్రతి రోజూ ప్రత్యేక స్టడీ అవర్స్ చాలా ఉపయోగపడుతున్నాయి. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులో సందేహాలు తీరుస్తూ పరీక్షలకు తయారు చేస్తున్నారు. మంచి మార్కులు తెచ్చుకుంటాం.

–రోహిత్‌కుమార్, పదో తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్,మదనపల్లె


విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ:



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం రూపొందించాం. విద్యార్థుల అంతర్గత పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం . సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

-పి.పుణ్యవతి, ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్‌ఎస్,మదనపల్లె

వంద రోజుల ప్రణాళిక అమలు



వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో జరిగిన పరీక్ష ఫలితాలను పరిశీలిస్తున్నాం. ఏ అంశాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో పరిశీలిస్తున్నాం. తరచూ పాఠశాలలను సందర్శిస్తున్నాం. విద్యార్థుల సందేహాలను నివృత్తికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

–సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

రాజంపేట మున్సిపాల్టీకి ఎంపీ నిధులు

రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీ పారిశుద్ధ్యానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తన ఎంపీ కోటాలో నిధులను కేటాయించారు. ఈ మేరకు గురువారం రాత్రి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట పట్టణంలో శానిటేషన్‌కు సంబంధించి తన ఎంపీ నిధుల నుంచి ఆర్థిక సాయం చేయాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిని కలిసి కోరామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి తన కోటా నుంచి రూ. 20 లక్షలు కేటాయించారన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పారిశుద్ధ్య విభాగానికి రెండు ట్రాక్టర్లు కొనుగోలు చేసి మున్సిపాలిటీకి అందజేస్తామన్నారు. నిధుల మంజూరుపై మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి కూడా మేడా రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అవమానకరంగా దూషించారంటూ కేసు నమోదు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట కల్లా వీధికి చెందిన సిర్రారపు నారాయణమ్మను అవమానకరంగా దూషించారని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కల్లా వీధికి చెందిన బాధితురాలు నారాయణమ్మ, నిందితులు మల్లికార్జున, సరస్వతి, శివ, లోకేష్ పక్క పక్క ఇంటి వారు. వారి ఇంటి మధ్యలో ఉన్న గోడ విషయమై మాటామాటా పెరిగిపోవడంతో నారాయణమ్మను వారు నలుగురు వీధిలో అందరి ఎదుట అవమానకరమైన మాటలతో దూషించారు. దీంతో బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే



ఆలయంలో ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని గురువారం ఆముదాలవలస ఎమ్మెల్యే రవికుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాలాలయంలోని సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టమాటా ధర ఢమాల్!



నా పేరు రామాంజులు. గాలివీడు సమీపంలోని వెలిగల్లు ప్రాజెక్టు దగ్గర ఎకరా భూమికి రూ.50 వేల వంతున గుత్త(కోరు) చెల్లించి 8 ఎకరాల్లో టమాటా, వంకాయ తోటలను సాగు చేశాను. టమాటా కాయలు యాపిల్ సైజులో ఉండి దిగుబడికొచ్చాయి. ధరలు అనుకూలించి మంచి లాభాలు వస్తాయని ఆశించా. టమాటా సాగుకు ఎకరం పొలానికి రూ.2.70 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అయింది. గుత్తకు తీసుకున్న భూమిలో 4 ఎకరాలలో టమాటా మరో 4 ఎకరాలలో వంకాయ పంటలను సాగు చేశాను. కాయలను మార్కెట్‌కు తీసుకెళ్తే మార్కెట్లో పలుకుతున్న ధరల మాట వింటే గుండె గుభేల్‌మంటోంది. ఆపిల్ కాయల సైజులో మొదటి రకం కాయలు 30 కిలోల బాక్స్ రూ.250 నుంచి రూ.300 వరకు మాత్రమే పలుకుతోంది. వంకాయలు కిలో రూ.10 కంటే ఎక్కువ పలకడం లేదు. ఈ ధరలతో రవాణా ఖర్చులు, కూలీలు కూడా చెల్లించుకోలేని పరిస్థితి.



నా పేరు జాకీర్‌హుస్సేన్. రాయచోటి మార్కెట్‌లో కూరగాయల వ్యాపారిని. మార్కెట్లో పలుకుతున్న కూరగాయల ధరలను చూస్తే పంటలను సాగు చేసిన రైతుల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారింది. స్థానికంగా రైతుల నుంచి సేకరించిన కాయలను బయట ప్రాంతాలకు పంపుదామన్నా అక్కడ కూడా ధరలు పడిపోయినాయి. మన జిల్లాలోనే కాకుండా పక్క జిల్లాలు, రాష్ట్రాలలో టమాటా సాగు ఎక్కువగా ఉంది. లారీలతో టమాటా, మిర్చి, వంకాయలు మార్కెట్‌కి వస్తున్నాయి. వాటిని ఎక్కడ విక్రయించాలో మాకు అర్థం కావడం లేదు. ఈ ధరలతో రైతులు భారీగా నష్టపోవాల్సిందే. సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని ధరలు అమాంతం పెరిగితే ఇప్పుడు సాగు అధికమై దిగుబడి గణనీయంగా పెరగడంతో కొనేవాళ్లు లేక పారబోయాల్సి వస్తోంది.

- 25 కిలోల బాక్స్ టాప్ రూ.130.. సాధారణం రూ.50 నుంచి రూ.100లోపే
- పశువులకు ఆహారంగా మారిన టమాటా
- దయనీయ స్థితిలో టమాటా రైతులు

రాయచోటి : నిన్న మొన్నటి వరకు రూ.60–రూ.70 ఓ దశలో రూ.100కు చేరువైన కిలో టమాటా ఇప్పుడు వ్యవసాయ మార్కెట్లలో కనీస ధరలకు కూడా కొనడం లేదు. అన్నమయ్య జిల్లాలోని మార్కెట్లకు మదనపల్లి, గుర్రంకొండ, వాయల్పాడు, కలకడ, రాయచోటి మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున టమాటా విక్రయాలు జరుగుతుంటాయి. మూడు నెలల క్రితం అకాల వర్షాలతో పంటలు నష్టపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. కొత్త పంట చేతికి వచ్చే సరికి ధరలు పడిపోయాయి. దీంతో రైతులు ఈ ధరలను చూసి అక్కడే కుప్పకూలిపోతున్నారు. వ్యవసాయ, కూరగాయల మార్కెట్లలో టమాటా, మిర్చి ధరలు 10 రోజుల నుంచి ఒక్కసారిగా పడిపోయాయి. 15 కిలోల టమాటా బాక్స్ టాప్ రకం వంద నుంచి రూ.130 ధరకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ఇక రెండో రకం కాయలు 30 నుంచి 100 రూపాయల లోపే పలుకుతున్నాయి. టమాటా పంట సాగు కోసం లక్షలాది రూపాయలు పెట్టిన పెట్టుబడి ముందు మార్కెట్ ధరలు కుళ్లిన వాసనను తలపిస్తున్నాయి.

దళారుల దోపిడీ..

కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తరలిస్తే అక్కడ దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు. నాణ్యత ఉన్న పంటకు గిట్టుబాటు ధర కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మార్కెట్లో వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధరలకు వేలం పాడుతుండటంపై రైతులు రగిలిపోతున్నారు. వ్యవసాయ మార్కెట్లోకి టమాటా కాయలు ఒక్కసారిగా రావడంతో ధరలు పడిపోయినట్లు మార్కెట్ దళారులు చెబుతున్నారు.



బాక్స్‌లోని టమాటాలు పశువులకు ఆహారంగా మారిన దృశ్యం

రైతు బజార్లలో..

జిల్లాలో పండించిన టమాటా రైతు బజార్లలో కిలో టమాటా ధర రూ.10 నుంచి రూ.15గా ఉంది. మదనపల్లి, గుర్రంకొండ, వాయల్పాడు, కలకడ, రాయచోటి మార్కెట్‌లలో నిత్యం 200 టన్నుల కొనుగోళ్లు జరుగుతాయి. మదనపల్లి, గుర్రంకొండ, వాయల్పాడు, కలకడలలో కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో కూడా పంటలు అందుబాటులోకి రావడంతో జిల్లా నుంచి ఎగుమతి అయ్యే టమాటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ధర తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం మార్కెట్లో కనీస ధరలు కూడా లేకుండా కొనడంపై రైతులు ఆగ్రహంతో టమాటాలను మార్కెట్లోనే పారబోసి వెళ్లిపోయారు. ఇలా వదిలేసిన టమాటా కాయలు పశువులకు ఆహారంగా మారాయి.

కూలీల ఖర్చులు రావడం లేదు..

మార్కెట్లో పలుకుతున్న ధరలతో కూలీలకు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఒక ఎకరంలో టమాటా పంటను సాగు చేయాలంటే రూ.2.5 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కంటికి రెప్పలా కాపాడుకుంటూ సాగు చేసిన టమాటా, ఇతర కూరగాయలకు మార్కెట్లో మద్దతు ధరలు లభించకపోవడంతో ఆర్థికంగా కుంగిపోవాల్సి వస్తోంది.

సాగుపై అవగాహన లేక..

పంటల సాగులో రైతులకు తగినంత అవగాహన లేకపోవడంతోనే మార్కెట్లో రైతు దివాలా తీస్తున్నారనే అభిప్రాయం ఉంది. మార్కెట్లో పలికిన ధరలను విన్న రైతులు అదే పంటను అధికంగా సాగు చేయడం ఈ దీనస్థితికి కారణం అని కొంతమంది చెబుతున్నారు. సంబంధిత వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు కూడా రైతు ఆర్థిక స్థితిగతులు పరిగణనలోకి తీసుకుని ఏఏ ప్రాంతాలలో ఏ పంటలు వేయాలి.. ఎన్నెన్ని హెక్టార్లలో సాగు చేయాలి అనే సమాచారంతో ప్రోత్సహిస్తే ఇలాంటి నష్టాలు ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

హైకోర్టు ఆదేశాలతో వెనక్కి తగ్గిన అధికారులు

మండల మీట్ నిర్వహణపై ఉత్కంఠ

పెద్దతిప్పసముద్రం : హైకోర్టు ఆదేశాలతో అధికారులు వెనక్కి తగ్గారు. పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19న మండల్ మీట్ జరగాల్సి ఉండగా హైకోర్టు ఆదేశానుసారం అధికారులు రద్దు చేశారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా బ్రహ్మానందరెడ్డి పని చేసే సమయంలో ఎంపీపీ అనుమతితో మండల్ మీట్ నిర్వహణకు అధికారులు సంసిద్ధమయ్యారు. అయితే సమావేశం నిర్వహించేందుకు ఎంపీపీతో పాటు సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై కోరం ఉన్నప్పటికీ కూటమి నాయకులు ఉద్దేశపూర్వకంగా అధికారులను కార్యాలయం లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు. సదరు ఎంపీడీఓ బదిలీ అనంతరం కొత్తగా వచ్చిన కేఎస్ బాలాజీ ఎంపీపీ అనుమతి లేకుండా మండల్ మీట్ తేదీని ప్రకటించగా సభ్యులు ఎవరూ హాజరు కానందున కోరం లేక వాయిదా వేశారు. తరువాత అధికారుల ఏకపక్ష ధోరణిని వివరిస్తూ ఎంపీపీతో పాటు పలువురు రాయచోటికి వెళ్లి సమావేశం నిర్వహణకు సహకరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ మండల మీట్‌కు తేదీ ఇవ్వాలని ఇటీవల ఎంపీపీ మహమూద్‌ను కోరగా ఈ వ్యవహారంపై హైకోర్టులో కేసు నడుస్తోందని తాను ఎలాంటి తేదీ ఇవ్వలేనని చెప్పారు. 90 రోజుల్లో ఎలాగైనా మీటింగ్ జరపాలనే ఉద్దేశంతో ఎంపీడీఓ ఈ నెల 19న జరిగే మండల మీట్‌కు హాజరు కావాలని సర్క్యులర్లు ఇవ్వగా వాటిని తీసుకునేందుకు పలువురు సభ్యులు నిరాకరించారు. దీంతో అధికారులు సర్క్యులర్ ప్రతులను రిజిస్టర్ పోస్టు ద్వారా సభ్యులకు పంపారు. ఈ తరుణంలో ఈ నెల 18న వారం రోజుల్లో మండల మీట్ జరపాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు 19న జరగాల్సిన సమావేశాన్ని రద్దు చేశారు. అయితే గతంలో మండల మీట్ వాయిదా పడిన మూడు సార్లు మండల పరిషత్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు పోలీసుల సమక్షంలోనే కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోతూ నానా హంగామా చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ధర్మాసనం తీర్పుకు అనుగుణంగా సభ్యులకు పోలీస్ భద్రత కల్పిస్తూ శాంతి భద్రతల నడుమ మండల మీట్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తారా, లేదా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సమావేశాన్ని వాయిదా వేస్తారో వేచి చూడాల్సి ఉంది.

మిద్దెపై నుంచి పడి చిన్నారికి గాయాలు

మదనపల్లె : మిద్దెపై నుంచి ప్రమాదశాత్తు పడి చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన బాబు కుమార్తె హిమలేఖ (4) సాయంత్రం తోటి చిన్నపిల్లలతో కలిసి మిద్దెపై ఆడుకుంటోంది. ప్రమాదశాత్తు మిద్దెపై నుంచి పడి తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు చికిత్స అందించినా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ బాగేపల్లికి చెందిన (15) ఓ మైనర్ బాలిక అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న బాలిక ఈ నెల 18న బంధువుల ఊరికి వెళుతున్నానని ఇంటి నుంచి బయలు దేరి ఆ తరువాత ఆచూకీ లేకుండా పోయింది. బాలిక తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా.?

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : కడప– రేణిగుంట జాతీయ రహదారి గుంతలమయమై ప్రతి రోజు రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రోడ్ల గురించి దుష్ప్రచారం చేసి అధికారం చేపట్టాక సంక్రాంతి లోపు రోడ్లు బాగు చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు కావస్తున్నా ఒక్కరోడ్డు కూడా బాగు చేయలేదన్నారు. ఇప్పటికే ప్రజలు చంద్రబాబు పాలనపై అసంతృప్తితో ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన మంత్రులు, నాయకులు కేవలం ప్రెస్‌మీట్లు, సమీక్షలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు అధికంగా పెంచడం దారుణమన్నారు. ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, ఆర్వీ రమణ, జనార్దన్‌రాజు, హరికృష్ణారెడ్డి, బండారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై కూటమి నేతల కక్ష సాధింపు

- వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయించారనే నెపంతో తొలగింపు
- ఆగ్రహించిన సంఘమిత్రలు, మహిళా సభ్యులు
- టీడీపీ నేత డి. జయచంద్రారెడ్డి ఇంటి ముట్టడి



టీడీపీ నేత జయచంద్రారెడ్డితో వాగ్వాదం చేస్తున్న మహిళలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చాలా ఏళ్లగా సంఘమిత్రలుగా పని చేస్తున్న చిరుద్యోగులపై కూటమి నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా బి.కొత్తకోట మండలానికి చెందిన పలువురు సంఘ మిత్రలను తొలగించడం వివాదానికి దారి తీసింది. బి.కొత్తకోట మండలానికి చెందిన సంఘమిత్రలు లక్ష్మీనరసమ్మ, ఈశ్వరమ్మ, భారతిలను స్థానిక కూటమి నాయకులు తంబళ్లపల్లె టీడీపీ నేత దాసరపల్లి జయచంద్రారెడ్డిపై ఒత్తిడి చేసి తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న సంఘమిత్రలు, పలువురు మహిళా సభ్యులు బుధవారం ములకలచెరువుకు వచ్చారు. సుమారుగా 50 మంది మహిళలు జయచంద్రారెడ్డి నివాసం వద్దకు చేరుకొని ముట్టడించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమని ఏ కారణంతో తొలగించారో చెప్పాలని నిలదీశారు. ఆగ్రహించిన జయచంద్రారెడ్డి మీరు వైఎస్సార్‌సీపీకి పని చేశారు.. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయించలేదు.. ఒక్కసారి తొలగించాక చేర్చుకునేదిలేదని వారిపై ఊగిపోయారు. అనంతరం మహిళలు జయచంద్రారెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఏ ప్రభుత్వం వచ్చినా మా విధులు చేయక తప్పదు. .ప్రభుత్వాలు అమలు చేసే పథకాల్లో భాగస్వాములవుతాము.. ప్రభుత్వం తరపున ప్రచారాలు చేస్తాము.. దీనికే మమ్మల్ని తొలగించడం తగదు అంటూ వాదించారు. మా లాంటి చిరుద్యోగులపైన కుటుంబాలు ఆధారపడి ఉంటాయి.. మా కడుపులు కొట్టొదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి తప్పులు, ఆరోపణలు లేకుండా తొలగించడం సరికాదన్నారు. ఆయన సానుకూలంగా స్పందించకపోవడంతో అక్కడి నుంచి వెను తిరుగుతూ తమను విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించి వెళ్లారు.

మండల సర్వేయర్‌పై కడప ఆర్డీఓ ఆగ్రహం



బాధితులతో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ

ఒంటిమిట్ట : ప్రభుత్వం తమకు కేటాయించిన భూములను చూపించాలని బాధితులు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించగా అందుకు సంబంధించిన భూములు ఇంత వరకు ఎందుకు చూపించలేదు, ఆ భూములు ఎక్కడ ఉన్నాయని మండల సర్వేయర్ ప్రియాంకపై ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని పెన్న పేరూరు గ్రామంలో తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, రాజంపేట నియోజకవర్గం టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తమ భూములు తమకు చూపించాలంటూ బాధితులు కోరగా దీంతో వారు సర్వేయర్ ప్రియాంకను వారి భూములు మ్యాప్‌లో ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. ప్రియాంక తడబడటంతో మీ ప్రాంతంలోని భూములు ఎక్కడ ఉన్నాయో మీకే తెలియకపోతే ఏం పని చేస్తున్నారని ఆర్డీఓ సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమక్షంలో సదస్సును నిర్వహించేటప్పుడు పూర్తి సమాచారంతో సదస్సుకు హాజరు కావాలన్నారు. అనంతరం సోమశిల వెనుక జలాలతో పెన్నపేరూరులో ముంపునకు గురవుతున్న తమ ఇళ్లకు పరిహారం ఇప్పించాలని ఆర్డీఓకు గ్రామ ప్రజలు విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ ముంపు ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రెవెన్యూ ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, మండల తహసీల్దార్ రమణమ్మ, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సవరణల బిల్లును ఉపసంహరించుకోవాలి



రాయచోటిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణల 2022 బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యుత్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం వద్ద విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేయకూడదని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ చండీగఢ్, ఉత్తరప్రదేశ్‌లలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ నాయకులు పురుషోత్తం, భాస్కర్‌నాయుడు, చిరంజీవి, నరసింహులు నాయక్, లక్ష్మీపతి, చంద్రశేఖర్, సుబ్రమణ్యంరాజు, ఏవీ రమణ, రాయచోటి, పీలేరు, మదనపల్లి, రాజంపేట డివిజన్ల జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అమ్మో.. కొండ చిలువ



రహదారిలో ఉన్న కొండ చిలువ

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం కొండ చిలువను చూసిన జనం హడలెత్తిపోయారు దిగువపేట గాండ్లపాలెం వెళ్లే రహదారిలో గురువారం రాత్రి కుమ్మరి కుంటలో నుంచి కొండచిలువ రహదారిపైకి వచ్చింది. అక్కడి నుంచి పొలాల్లోకి వెళుతుండగా వాహనదారుల కంట పడింది. దీంతో ఆ మార్గాన వెళ్లే వారంతా భయభ్రాంతులయ్యారు.

20 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : కురబలకోట మండలంలో గురువారం జరిపిన ఎక్సైజ్ దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. గురువారం కురబలకోట మండం పిచ్చలవాండ్లపల్లె గ్రామం, కనికలచెరువు సమీపంలో సారా తయారీ బట్టీలను గుర్తించామన్నారు. వాటిని ధ్వంసం చేసి 800 లీటర్ల సారా ఊటను నాశనం చేశామన్నారు. సారా తయారీ చేస్తున్న నక్కలదిన్నె తాండాకు చెందిన మునేనాయక్ కుమారుడు కె.శంకర్‌నాయక్ (45) సంఘటన స్థలం నుంచి పరారీ కాగా అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్‌ఐలు డార్కస్, జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సరస్వతి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. పుంగనూరు మండలం లద్దిగం గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి బాబు (50), భార్య సరస్వతి(45) తో కలిసి ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం మదనపల్లెకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా పుంగనూరు రోడ్డులోని బసినికొండ బైపాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో సరస్వతి, బాబు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సరస్వతి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

నిరసన ప్రదర్శనలో ప్రజాసంఘాల నేతలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : రాజ్యసభలో జరిగిన చర్చలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే భారత జాతికి క్షమాపణలు చెప్పాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల నేతలు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపశిల్పి అయిన అంబేడ్కర్ గురించి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా అమిత్‌షా తన మనువాద దృక్పథాన్ని బయటపెట్టారన్నారు. కోట్లాది దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆత్మగౌరవానికి అంబేడ్కర్ ప్రతీక అన్నారు. ఆయనను అవమానిస్తే దేశ ప్రజలను అవమానించేనట్లే అన్నారు. అమిత్‌షాకు హోం మంత్రిగా కొనసాగే హక్కులేదని తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రజాతంత్రవాదులు, మేధావులు, లౌకిక, సామాజిక వాదులంతా ఖండించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు రామాంజులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథనాయక్, బాస్ రాష్ట్ర కార్యదర్శి పలం తాతయ్య, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డెయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు శంకర్ నాయక్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కోటేశ్వరరావు, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా కార్యదర్శి జగన్, దళిత నాయకులు పామయ్య, రాజారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



దొంగను కట్టేసిన గ్రామస్తులు

గుర్రంకొండ : ఇళ్లు, దుకాణాల్లో చోరీలకు పాల్పడిన దొంగకు గ్రామస్తులు దేహశుద్ధి చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పెద్దమండ్యం మండలం కలిచెర్ల వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప అనే వ్యక్తి కొత్తపేట, పోలేరమ్మవీధిలో పలుచోట్ల గతంలో చోరీలకు పాల్పడ్డాడు. ఇదే వ్యక్తి గతంలోనూ లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ వద్ద ఓ ఇంట్లో స్పోర్ట్స్ సైకిల్ చోరీ చేశాడు. సింగిల్‌విండో కార్యాలయం వద్ద రాజు అనే వ్యక్తికి చెందిన లేత్‌మిషన్‌లో పలు పరికరాలను చోరీ చేసుకెళ్లాడు. ఈ విషయాన్ని సదరు దుకాణాల యజమానులు సీసీ పుటేజీల ద్వారా గ్రహించారు. గురువారం ఇదే వ్యక్తి మళ్లీ కొత్తపేటలో సంచరిస్తూ ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతుండగా గ్రామస్తులు పట్టుకొన్నారు. బాగా దేహశుద్ధి చేసి పోలేమ్మవీధిలోని ఓ దుకాణం వద్ద కట్టిపడేశారు. గతంలో చేసిన చోరీలను అడిగి తెలుసుకొని పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్తులు దొంగను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.